# సింగిల్ పేజీ కథలు

## సుధామృతం

అమృతకి సాయంత్రం జరగబోతున్న ఎంగేజ్‌మెంటొకి వెళ్ళటం సుధకి ఇష్టం లేదు.

అలా అని అసూయతో కాదు. తనకి ఎంగేజ్‌మెంట్ జరిగి పెళ్ళి ఆగిపోయింది. కారణం...

“పెళ్ళికొడుకు తరపు వాళ్ళెవరో పోయారని... మరోఏడాది వరకూ పెళ్ళి చేయమని..అప్పటివరకూ మీరు మాకోసం ఎదురు చూడకుండా...మీ అమ్మాయికి మరో సంబంధం చూసుకోగలరు” అంటూ ఓ ఉత్తరం రాసి పారేశారు.

నమ్మకంగా తెలిసిందేమంటే తనకన్నా ఎక్కువ జీతం..ఎక్కువ కట్నం ఇచ్చే మరో అమ్మాయి దొరకటం వల్లే వాళ్ళానాటకం ఆడారని.

“డబ్బుకి గడ్డితినే సంస్కార హీనులు..వాళ్ళు డబ్బు కోసమే పరుగులు తీస్తున్నప్పుడు ఎంత అభ్యర్థించినా..కాళ్లా వేళ్ళాపడినా ఉపయోగం వుండదు”

“నీకు అందం వుంది..చదువుంది..మంచి ఉద్యోగముంది. మంచి సంబంధం తప్పక దొరుకుతుంది. నువ్వు బాధపడకమ్మా” ఏడుస్తున్న కూతుర్ని వూరడించాడు తండ్రి రామారావు.

‘సాయంత్రం ఫంక్షన్లో అందరూ ఆగిపోయిన తన పెళ్ళి గురించే రకరకాల ప్రశ్నలడుగుతారు. ఏం జవాబు చెబుతుంది? ఏం చెప్పివారి నుండి రక్షించుకుంటుంది? తప్పుచేసిన దానిలా అంత మంది నుండి ఎలా తప్పించుకొని తిరగ్గలదు?’ అంటూ తనలో తాను మధనపడింది సుధ.

“సుధా నువ్వు బాత్రూంకెళ్ళి అరగంట దాటింది. అప్పటినుండీ అమృత నీకోసం నీ రూమ్‌లో వెయిట్ చేస్తోంది? పోనీ అదయినా గుర్తుందా?” తలుపు మీద చప్పుడు చేస్తూ అరిచి చెప్పింది సుధ తల్లి కామాక్షి.

ఒక్కసారిగా ఉలిక్కిపడింది “అవునుకదా! అమృత తనని వాళ్ళింటికి తీసికెళ్ళటానికి వచ్చింది. రానన్నా వినకుండా బలవంతంగా లీవ్ లెటర్ పెట్టించింది” గబగబా స్నానం అయిందనిపించి బయటపడింది.

సుధ రూమ్‌లో కూర్చున్న అమృత అక్కడున్న పుస్తకాలు తిరగేస్తోంది. ఇంతలో అక్కడికొచ్చిన సుధ మీద “ఏం తల్లీ! ఎంగేజ్‌మెంటొకి బయలుదేరతీస్తే..పెళ్ళి ముహూర్తానికి వచ్చేలా వున్నావే” హాస్యమాడింది.

“సారీ..సారీ..టెన్ మినిట్స్‌లో”

“అంతేనా నీ ఎంగేజ్‌మెంటొకి నేను రాలేదని ఇలా చేస్తున్నావా?” అంది.

“ఏడ్చావులే” అంటూనే... పది నిముషాలలో ముస్తాబైంది.

ఒక్కసారి సుధని నిలువెల్లా చూసి “ఇంత అందాన్ని చేజార్చుకున్న ఆ నిర్భాగ్యుడెవరో?” కాస్త కోపంగానే అంది.

“జరిగిపోయినవన్నీ ఇప్పుడెందుకు? పద పద” అంటూ తొందర చేసింది ఆ విషయాలు మాట్లాడుకోవడం తనకిష్టం లేదన్నట్టు.



పదింటికే వస్తామన్న పెళ్ళివారు రెండు దాటాక వచ్చారు. ట్రైన్ లేటని ఫోన్ చేసి చెప్పారు. ఏవో ఆలోచనల్లో వున్న సుధకి విపరీతంగా తలనొప్పి వచ్చింది.

టాబ్లెట్ వేసుకొని తన రూమ్‌లో రెస్ట్ తీసుకోమని అమృత ఎంత చెప్పినా వినకుండా “వాళ్ళు రాగానే ఫోన్ చెయ్యి వెంటనే వచ్చేస్తాను” అని పన్నెండున్నరకే ఇంటికి వచ్చేసింది. కానీ...

ఆ సాయంత్రం వరకు అమృత వద్దనుండీ అసలు ఫోన్ కాలే రాలేదు. ఎదురు చూసి ఎదురు చూసి వెళ్ళింది. “ఏంటి ఇంకా పెళ్ళి వారు రాలేదా?” మనసులో ఏదో అనుమానాలు పీకుతుండగా ఆదుర్దాగా అడిగింది.

“వచ్చారు. కాకపోతే ఎంగేజ్‌మెంట్ కేన్సిలయ్యింది” కూల్‌గా చెప్పింది అమృత.

సుధకి నెత్తిన పిడుగు పడ్డట్టయ్యింది. ఇదేంటి మా ఇద్దరికి ఒకేలా అయ్యింది. తనకి నిశ్చితార్థం జరిగి పెళ్ళి ఆగిపోయింది. ఆమెకి నిశ్చితార్థమే ఆగిపోయింది. తను అక్కడ అడుగుపెట్టడం వల్ల ఈ అనర్థం జరగలేదు కదా! తను నష్టజాతకురాలా? ఆ ఇంట్లో కూడా తన గురించి అలా అనుకుంటున్నారా? ఏమో అనుకోవచ్చు. ఇంకా ఏమేమో అనుకోవచ్చు. తన జాతకం అలాంటిది మరి. అన్యమనస్కంగానే సారీ చెప్పింది.

“ఆ..నువు సారీ చెప్పేంత సీన్ ఇక్కడ జరగలేదులే” తేలిగ్గా కొట్టిపారేసింది అమృత.

వారం తర్వాత సుధకి నిశ్చితార్థం జరిగిన అబ్బాయి వాళ్ళ దగ్గర్నుండి ఫోన్ వచ్చింది. “మా వల్ల జరిగిన అసౌకర్యానికి...అవమానానికి దయచేసి మమ్మల్ని క్షమించండి. ముహూర్తాలు ఎప్పుడు పెట్టుకుందాం?” అని.

అమృత..సుధని పెళ్ళి కూతురుగా అలంకరిస్తోంది. “మా అందరికి ఇంకా ఆశ్చర్యంగానే వుంది. అసలు వాళ్ళెందుకు మనసు మార్చుకున్నారో? మా కెవ్వరికీ అర్థం కాలేదు...బాగా ఆలోచించిన మీదట నాన్న అంగీకరించారు” అంది సుధ.

“కానీ నాకర్థమైంది”

“ఏమనీ?”

“ఎవరో బాగా గడ్డిపెట్టారని” కసిగా అంది.

“అదేంటి?” తెల్లమొహం వేసింది సుధ.

“అదంతే! పెద్ద జీతం అమ్మాయి దొరికిందని నిన్ను కాదన్నారు. అందలంలో వున్న మరో అమ్మాయి దొరికితే మళ్ళీ ఇదే పరిస్థితి పునరావృతం కావచ్చుకదా?”

సుధ అర్థం కానట్టు చూసింది.

“నా ఎంగేజ్‌మెంట్ రోజు నీ రూమ్‌లో బుక్స్ తిరగేస్తొంటే పెళ్ళికొడుకు ఫోటో చూశాను. నన్ను చూసుకోవడానికి మా ఇంటికి రాబోయే పెళ్లికొడుకు ఇతనే అని అర్థం అయింది. ఆ ఫోటోని నాతో పాటే తీసికెళ్ళాను. ఫోటో చూపించి నాన్నగారికి..అన్నయ్యకి నీ సంగతి చెప్పాను”

సుధ ఆశ్చర్యంగా చూస్తోంది.

“ఇంకేముంది వెళ్ళి ఎడా పెడా వాయించేసారు. వారి ప్రవర్తనలో మార్పు వచ్చింది. నీకు ముహూర్తం పెట్టారు” కిలకిలా నవ్వింది అమృత.

సుధ కళ్ళు తడితేరాయి. అమృత ఇంత హాయిగా..ఆనందంగా ఎలా నవ్వగలుగుతోంది? అమృత

ఒక మామూలు ఆడపిల్లలా కాకుండా అందుకు భిన్నంగా ఎలా ప్రవర్తించగలిగింది? అమృత పట్ల కృతజ్ఞతతో..ఇదీ అని నిర్వచించలేని మరేదో భావనతో సుధ మనస్సు నిండిపోగా..

అ..మృ..తా..స్నేహితురాల్ని కౌగలించుకుంది. ఒకరికి కుదిరిన సంబంధాలు చెడగొట్టి తమకి కుదుర్చుకునే స్నేహితులున్న ఈరోజుల్లో నీలాంటి స్నేహితురాలు, నీ స్నేహం దొరకటం నా అదృష్టం. నీ పేరే కాదు మనసు కూడా అమృతమయమే..కన్నీటితో అమృత భుజాన్ని తడిపేస్తోంది సుధ.

**-కె.విజయలక్ష్మి**

**(బాపట్ల)**

# పశ్చాత్తాపం

"సార్...మేనేజరుగారు ఈవిడ విషయం మిమ్మల్ని చూడమన్నారు" అటెండరు చంద్రయ్య మాటలు విని తలెత్తి చూశాను. ఆమెకు దాదాపు ముప్పై ఏళ్ళుండవచ్చు. ముఖంలో దైన్యం. దుస్తుల గురించి పట్టించుకొనే ఓపిక లేనట్లు నలిగిన దుస్తులతో ఉంది.

"కూర్చోండి" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీ చూపి "చంద్రయ్యా, నాయర్‌ను రెండు కాఫీలు పంపమను" అన్నాను అటెండర్‌తో.

ఆమె కూర్చుని "వచ్చే గురువారం మా ఆయనకు గుండె ఆపరేషన్. ఆయన ఓ ప్రైవేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నారు. నేనూ అదే స్కూల్లో పనిచేస్తున్నాను. ఆపరేషన్ ఖర్చు భరించే ఆర్థికస్థోమత మాకు లేదు. అందుకే మా ప్రిన్స్‌పాల్ సలహా మేరకు ఇలా అన్ని ఆఫీసులకు వచ్చి సహాయం అర్థిస్తున్నాను. మీ మేనేజరుగారిని కలిసాను. ఆయన మీతో మాట్లాడమన్నారు" అంటూ తను తెచ్చిన ప్లాస్టిక్ ఫోల్డర్ నుండి డాక్టర్ రిపోర్ట్స్ తీసి చూపించబోయింది ఆమె.

నేను మా బ్రాంచి కల్చరల్ సెక్రటరీగా ఉన్నంతకాలం ఇటువంటి విషయాల్ని మా బ్రాంచి మేనేజరు నాకు అప్పజెప్పేవారు. నేను వచ్చినవాళ్ళ వివరాలు అడిగి, వాళ్ళు చెప్పింది నిజమని నిర్ధారించుకొని, తర్వాత సర్క్యులర్ ద్వారా తోటి ఉద్యోగులందరినీ తమకు తోచినంత యివ్వమని కోరడం, వసూలయిన మొత్తాన్ని ఆ సహాయం అడిగినవారికి. అందించడం జరుగుతుండేది. అయితే ప్రస్తుతం మా బ్రాంచి కల్చరల్ సెక్రటరీ రామ్మూర్తి. ఆ విషయమే ఆమెకు చెప్పి బ్రాంచి మేనేజర్ అలవాటు చొప్పున నా దగ్గరకు పంపించారని, నాతో వస్తే రామ్మూర్తికి పరిచయం చేస్తానని చెప్పాను.

"ఆయనతో మీరు కాస్త చెప్పండి" అది దాదాపు ఏడుస్తూ.


"నేను చెబుతాను. మీరు ధైర్యంగా ఉండండి. మీవారికి నయమౌతుంది. ఆ భగవంతుణ్ణి నమ్ముకోండి. నమ్మిన వాళ్ళను ఆయన తప్పకుండా కాపాడుతాడు" అన్నాను.

ఇంతలో కాఫీలు రావడంతో యిద్దరం త్రాగాము.

తర్వాత ఆమెను రామ్మూర్తికి పరిచయం చేసి అందరినీ వీలైనంత ఎక్కువ మొత్తం విరాళంగా యివ్వమంటూ సర్క్యులర్ తయారు చేయమని చెప్పి నా సీటుకు వచ్చేశాను.

మరో గంటకు సర్క్యులర్‌తో అటెండరు నా దగ్గరికి వచ్చాడు. రామ్మూర్తి పంపిన సర్క్యులర్ అది. గుండె ఆపరేషన్ ఎంతో ఖర్చుతో కూడుకున్నది కాబట్టి మానవతా దృక్పథంతో సహాయం చెయ్యమని రామ్మూర్తి రాసి పంపాడు.

నాకు ఒక విషయం గుర్తొచ్చి నవ్వొచ్చింది. నేను గతంలో పంపిన అనేక సర్క్యులర్స్‌లో రామ్మూర్తి ఎంతో కొంత మొత్తం రాసేవాడు, సర్క్యులర్ చూసిన వాళ్ళకు అతనూ యిచ్చాడని తెలియడానికి. అయితే డబ్బులు మాత్రం యిచ్చేవాడు కాదు. అతని విషయం తెలియక



మొదట్లో అతనికి రెండుసార్లు డబ్బు విషయం నేను గుర్తుచేశాను. అతను ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకొన్నాడు. అప్పట్నుంచీ అతన్ని డబ్బులు అడగటం మానుకొన్నాను. అతను పేరు రాయడం, డబ్బులు యివ్వకపోవడం అటెండర్లకూ అలవాటయిపోయింది. అతను రాసిన మొత్తం ఎదురుగా 'నాట్ పెయిడ్' అని రాసి, ఆ కాగితాన్ని ఫైల్ చేసుకోవడం నాకూ అలవాటయిపోయింది.

సర్క్యులర్‌లో రామ్మూర్తి పేరు కోసం వెతికాను. వంద రూపాయలు అతను యిచ్చినట్లు రాసి ఉంది.

"రామ్మూర్తి డబ్బులిచ్చాడా" అని అటెండర్ని అడిగాను.ఇచ్చాడని చెప్పాడు. 'దొంగచేతికి తాళాలివ్వడం మంచిదే అన్నమాట' అనుకొన్నాను. అతని ప్రవర్తనకు నాకు కోపం రావడానికి కారణం రామ్మూర్తికి ఆర్థికంగా ఏ యిబ్బందీ లేకున్నా అతను అంత లోభిత్వం చూపించడమే. అతని భార్య బ్యాంకులో పనిచేస్తుంది. బాధ్యతలు, బాదరబందీలు లేవు.

ఇంతలో నాకో ఆలోచన వచ్చింది. రామ్మూర్తి ప్రవర్తించినట్లే నేనూ ప్రవర్తించి అతనికి బుద్ధి చెప్పాలనుకొన్నాను. లిస్టులో నా పేరు రాసి ఎదురుగా రెండువందలు అంకెల్లో వేసి సంతకం పెట్టాను. డబ్బు తర్వాత యిస్తానని చెప్పి అటెండర్‌ని పంపేశాను. ఆరోజు రెండుసార్లు రామ్మూర్తి నా సీటు దగ్గరకి వచ్చి డబ్బులు అడిగాడు. అతను చెప్పిన సాకులే నేనూ చెప్పాను. ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. మా ఆఫీసులో వందమందికి పైగా ఉద్యోగులు ఉండటంతో ఏడువేలకు పైగా వసూలయిందని, ఆ మొత్తాన్ని ఆమెకు ఆ రోజు సాయంత్రమే అందచేశారని తెలిసింది.

ఒకరోజు ఆఫీసుకు రాగానే ఆమె కనిపించింది. నా కోసమే కాచుకొని ఉన్నట్లు నన్ను చూడగానే వడివడిగా సమీపించి "ఆపరేషన్ విజయవంతం అయింది. మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను" అంటూ కన్నీళ్ళతో రెండు చేతులూ జోడించింది.

నాకు సిగ్గేసింది. డబ్బులు సేకరించింది నేను కాదు, రామ్మూర్తి. పైగా నేను ఒక రూపాయి కూడా యివ్వలేదు. మామూలుగా యిటువంటి సందర్భాలలో కనీసం వంద రూపాయలైనా యిచ్చేవాణ్ణి. రామ్మూర్తికి బుద్ధి చెప్పాలని, అవసరంలో ఉన్న ఆమెకు ఆ డబ్బు అందివ్వకపోవడం ఎంతవరకు సమంజసం?"అన్ని ఆఫీసుల్లోకి మీ ఆఫీసులోనే ఎక్కువ మొత్తం వసూలయింది. మీరు నా బాధ ఓపికగా విని, రామ్మూర్తిగారితో చెప్పి ఈ సహాయం చేయించారు. ముఖ్యంగా నాకు ధైర్యం చెప్పారు. ఓ మంచి వ్యక్తి నోటి నుంచి వచ్చే మంచిమాటలు నిజమవుతాయని నేను ఎక్కడో చదివాను. అది నిజమైంది ఈరోజు" అంది ఆమె కృతజ్ఞతగా.

వెంటనే జేబునుంచి ఓ అయిదువందల నోటు తీసి ఆమెకు యిస్తూ "ఉంచండి. మందులకు పనికివస్తుంది" అన్నాను. పంతానికి పోయి మానవత్వాన్ని మరిచానని నన్ను నిలదీస్తున్న నా అంతరాత్మకు సమాధానం చెప్పగలిగానన్న తృప్తి నాకు మిగిలింది.

**-సి.ఎస్.చంద్రశేఖర్**

**(చిత్తూరు)**